



ఒకానొకప్పుడు అమరావతి రాజ్యాన్ని పద్మనందుడనే రాజు పరిపాలిస్తుండేవాడు. పద్మనందుడు అష్టభాషాకోవిదుడు. ఆడంబర ప్రియుడు—రాజ్యకాంక్షగల రాజు. ఆ 'తృష్ణ' ఒక్కటే అతనిలో మన మెంచగల దుర్గుణము అది మినహా అతడన్ని విషయములలోను ఎంతో మంచివాడు.

పద్మనందునికి ఒక నమ్మకమైన 'బంటు' ఉన్నాడు అతనన్ని వేళలలోనూ ప్రతి విషయములోనూ మహారాజును కంటికి రెప్పలా చూచుకునేవాడు. మహారాజు తోడిదే వాడి లోకం. పద్మనందు

# ★ పరీక్ష ★

నికి మినహా మరెవ్వరూ అతణ్ణి ఆదరించేవారు కారు. ఏననేమి? ప్రభుసేవాతత్పరతలో అతను మరవక మసలుకునే ఆ నమ్మకమైన బంటుకేలోటూ రానీయలేదు మహారాజు.

ఆ సంవత్సరం ప్రక్కనున్న రాజ్యంపై దండెత్తి, తన రాజ్యపు విస్తీర్ణతను పెంచ సంకల్పించాడు పద్మనందుడు అనుకున్నదే తడవుగా అన్ని హంగులూ చూచుకుని ప్రక్క రాజ్యం మీద సేనల నడిపించాడు మహారాజు.

ప్రక్కరాజ్యంలో కరువు కాటకాలతో ప్రజలు బాధపడుతున్నందున ఆ రాజు పద్మనందునితో సంధిచేసుకున్నాడు. సంధి షరతుల ప్రకారం పద్మనందుడు లక్ష వరహాల కప్పం కోరాడు. కానీ అతడెలా యీయగలడు? మంచిమాటలతో సాదరంగా 'మహజరునామా'తో అప్పటికి వాయిదా వేసి సాగ నంపాడు.

పద్మనందుడు విజయయాత్ర ముగించుకుని అమరావతి జేరాడు పరివార సమేతంగా. విజయయాత్ర ముగించుకుని తిరిగి వెనక్కు మరలేటప్పడే 'రాజుగారిబంటు'కు జ్వరం తగిలింది. రాజభవనం చేరుకునే సరికి వ్యాధి మరీ ఎక్కువైంది.

మహారాజు రాజవైద్యుల నాజ్ఞాపించాడు చికిత్సకొరకు. ఎందరెందరో కొమ్ములు తిరిగిన వైద్యశిఖామణులు చికిత్సలు చేశారు. తుదకు ఒకక్షణాన 'బంటు' ప్రాణవాయువు అనంతవాయువులో లీనమైంది మహారాజు విచారానికి మేర లేదు.

మహారాజు కారాత్రి నిద్ర పట్టలేదు. తన నంతా చిత్తం చిత్తం అంటూ వంగి వంగి సలాము లాచరించినా తానింతవరకెవ్వరినీ పూర్తిగా నమ్మలేదు ఒక్కబంటును మినహా! ఒకసారి వేటకువెళ్ళినప్పుడు అనుకోని విధంగా సంభవించిన దుస్సంఘటనలో తన ప్రాణాన్ని లెక్కచేయక స్వామిని సంరక్షించి తన స్వామిభక్తిని ఋజువు చేసుకున్నాడు. అందరూ ప్రదర్శించే నక్కవినయాలు అతను ప్రదర్శించకపోయినా నిష్కల్మషంగా—నిండు హృదయంతో మహారాజును సేవించాడు. అటువంటి బంటు దూరమైనాడంటే ఎలాంటి మహారాజుకైనా విచారం వేయదూ?

అతను తలచుకుంటే ఎంత మంది బంట్లనైనా పెట్టుకోగలడు—రప్పించుకోగలడు. కానీ ఆ బంటు కాలిగోటికి సరిరారు. మహారాజు మనస్సులో అశాంతి బయల్దేరింది. ఆలోచించి ఆలోచించి బుఱ్ఱ వేడెక్కింది.

తనకు నమ్మకమైన బంటు యిప్పుడు కావాలి? ఎలా వస్తాడు? ఎక్కడి నుంచి వస్తాడు? పేరుకైతే వస్తారు చాల మందికానీ 'బంటు' లాంటివాడు దొరకవద్దూ! - ఏది ఏమైనా తను ఎట్లాగూ ఒకబంటును నియమించుకోవాలి. వాడికి 'బంటు' లోని గుణాలుండాలి?

తను పరీక్ష పెట్టాలి. తన పరీక్షలో ఎవరు నెగ్గుతారో వానిని తనబంటుగా నియమించుకోవాలి. తను పరీక్ష పెట్టాలి: కానీ ఏనిటా పరీక్ష. మహారాజు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. పరిపరి విధాల ఆలోచించినా అతనికి సరియైన పంథా ఏమిటో బోధపడుటంలేదు.

మహారాజు యీ విషయం గురించి—బంటు నియామకం—తను పెట్టదలచుకున్న పరీక్ష గురించి—ఎవ్వరితోనూ సూచనామాత్రంగా గాని—సలహాకొరకు గాని సంప్రదించ దలచుకోలేదు. అది అతని ప్రకృతికే విరుద్ధం.

మహారాజుకు ఉండుండి మెరపు లాంటి వెఱవు తట్టింది. దానికి తోడు 'దండయాత్ర' కనుకూలమైనపరిస్థితులూ వున్నాయి. మహారాజు మాళవదేశం మీద యుద్ధం ప్రకటించాడు. చతురంగ బలాలు సిద్ధం చేసుకుని మహారాజు మాళవం మీదికి సేనలను నడిపించాడు.

అమరావతి మహారాజుకూ—మాళవ మహారాజుకూ పోరు



లల్లూరాం అండ్ కంపెనీ
(స్థాపితము 1928)
ఎన్నో సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధి చెందిన
* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు
* క్యాషు బాక్సులు
లల్లూరాం అండ్ కో,
వెలగలేటివారి వీధి, : : విజయవాడ - 1.
క్రొత్త పోహూస్ - మారుతి సినిమా ఎదురుగా

ఘోరంగా జరిగింది. అమరావతీ పతి అనుకున్న దానికంటె హెచ్చు స్థాయిలో పోరుజరిగింది. ఘూర్జర భూపతి అతనికి సాయం చేసినట్లు వేగులవలన వార్తలు వచ్చాయి. ధైర్యం చిక్కబట్టి-వ్యూహాలూ-ఎత్తులకు పైఎత్తులూ వేసి మాళవ మహీపతిని ఓడించాడు పద్మనందుడు.

సంధి షరతుల ప్రకారం మాళవ మహీపతి పద్మనంద మహారాజుకు పదివేల మొహారీలు కప్పం కట్టుకున్నాడు, ఒక రాష్ట్రాన్ని పూర్తిగా వదలుకుని. మొహారీల సంచులు గజములపై వేసుకుని స్వరాజ్యం వైపు గమించారు అమరావతీ ప్రభువులు సైన్యయుక్తంగా.

సైన్యం అలసి సొలసి వున్నందున కాస్త అప్రమత్తతతోనే ప్రయాణము సాగించుచుండెను మహారాజు కూడా కడు డస్సి ఉన్నాడు. తానెక్కిన గజముపై నున్న మొహారీల సంచికి చిన్న బెజ్జము గావించినా డుద్దేశపూర్వకంగా.

కొంత దవ్వేగునరికి సంచిలోని మొహారీలు పూర్తిగా క్రిందకు జారిపోయెను. సైన్యయుక్తంగా మరి కొంతదూరం సాగిపోయాడు మహారాజు. ఒకచోట సైన్యాన్ని ఆగ నాజ్ఞాపించి గంభీర స్వరంతో యిట్లనెను. "సైనికులారా! ఎన్నో ప్రయాసలకోర్చి మొక్కవోని వీరత్వంతో మాళవీయుల నోడించి కప్పంకట్టునట్లు చేశారు. మాళవీయులు చెల్లించిన మొహారీలుగల సంచుల్లో ఒక దానిలోని మొహారీలు పూర్తిగా దానికున్న చిన్న బెజ్జంనుండి జారిపోయినవి. ఈ దిగ్విజయ యాత్రా సంతోష సమయంలో మీకు వానిని బహుమానంగా యిస్తున్నాను. వెళ్ళండి. బాట వెంట బంగారు మొహారీలు పడివున్నాయి. ఎవరికి దొరికినవి వారే తెచ్చుకోండి. మీ యిష్టానుసారంగా ఖర్చుచేసుకోండి."

ఉరుకులు పరుగులతో-బంగారు మొహారీల కొరకు-సైన్యం వెనక్కు ఉరికింది. మహారాజుగారు ఆసీనులైయున్న గజంమాత్రం అక్కడే వుంది. దాని వెనకమాత్రం ఒక నల్లటి వ్యక్తి కరవాలంతో నిలబడి వున్నాడు.

మహారాజు ఒక్కక్షణం అనంతరం వెనక్కు మళ్ళి చూచారు. సైన్యం ఆనందోత్సాహాలతో వెనక్కు వురుకుతావుంది ఒకరికొకరు తగువులాడుకుంటూ మొహారీల కొరకు యింకా వెనక్కు వురుకుతున్నారు-గజం వెనక నిలుచున్న "నల్లని వ్యక్తి"పై బడింది మహారాజుల దృష్టి. మహారాజాశ్చర్యచకితుడై, "సైనికులంతా బంగారు మొహారీలేరుకొనుచుండ నీ వొక్కడ విక్కడేల యుంటివి?" అని ప్రశ్నించెను.

"బంగారు మొహారీలు నా ఒక్కనికి వుపయోగిస్తవి. కానీ మీరు మా దేశాన్ని కాపాడుతున్నారు- ఇదిఅసలే కొండప్రదేశం. ఎవరైనా ఏదైనా అఘాయిత్యం చేయవచ్చు-నరువాత పశ్చాత్తాప పడితేమాత్రం ప్రయోజన మేముంది? నా ఒక్కని స్వలాభమునకై దేశ శ్రేయస్సును కాపాడే నాస్వామిని విడిచి ఎలా పోను? నాకు ఆమణులూ మాణిక్యాలూ వద్దు-నాప్రభువు చల్లగా వుంటే అలాంటివి కోట్లు కోట్లాది ప్రజలకిస్తారు. వారంతా హాయిగా వుంటారు అన్నాడతను.

పద్మనందుని కళ్ళల్లో ఆనంద భాష్పాలు నిలిచాయి. తాను మహారాజనే సంగతి మరచి-అంబారినుండి దిగి తన మొదటి బంటును తాకినట్లుగా అతనిచేతిని తాకి నెమ్మదిగా అతని వీపు తట్టి 'సెభాష్' అని అంబారి ఎక్కాడు. "నేటినుండి నీవు నా బంటువు" అన్నాడు రాజు.

సైన్యం తిరిగి వచ్చింది సరివారంతో రాజు ముందుకు సాగిపోయాడు. "బంటును" చూచి మంత్రులు ముక్కు మీద వేలేసుకుని "వీడు గజదొంగ" అని సవినయంగా విన్నవించారు, మహారాజుకు—"దొంగలని భ్రమింప జేసే దొర" మందహాసంచేశాడు మహారాజు.

★


ప్రెసిడెంట్

వెజిటబుల్ హేర్ ఆయిల్,

స్నో, టాల్కమ్ పౌడర్

నా ఉపయోగానికి శ్రేష్ఠమైనవని నేను కనుగొన్నాను

—(సం) అంజలీదేవి



ఉత్పత్తిదారులు:

రథోడ్ ట్రేడింగ్ కంపెనీ, మద్రాసు - 1.